దెచ్చిన" వని అడిగింది. నేను బిస్కోట్ల డబ్బ గట్టిగ పట్టుకొని ఏడుస్తుంటె పెద్దపంతులమ్మ వొచ్చి "సూడుండి! పిల్ల అంటె ఇట్లుండాలె మా బడికి పేరొచ్చొంది". అన్నది. అడ్డగోడెక్కి చిలుమన్ పర్దాల సాటుకెల్లి తుర్కపంతులమ్మలు గూడ నన్ను జూసిర్రు. మాళ్ళా గట్ల తుర్కపాఠం అడ్గితె ఎట్లా?

ఎట్టైన నేను సాళ్లె మానగూడదు. ఆంజనేలూ తండ్రి నేను సాళ్లెమానకుండ, వాణ్కి దొర్కకుండ ఉండాలె. ఒగయాల్ల నేనుగిన ఆ దొంగోన్కి దొర్కితి నంటె మొమ్మైమ్మె ముద్ద అయిత గద, నన్ను నూనె లేస్తె నా కెంత మంట లేస్తదో ఏమొ? ఎట్ల జేతబ్బా! ఈ పాడు మొమ్మైమ్మెని దేవుడు ఎందుకు పుట్టించిండో, ఏమో?

ఈ మొమ్మైమ్మెతోటె ముత్యాలు జేస్తరంట ఇంగ అట్ల జేసిన మొమ్మైమ్మె ముత్యాలన్ని ముత్యాల నాగప్ప కొనుక్కొచ్చి చిన్నవి పెద్దవి ఏరితూట్లు గుచ్చి పేర్లు పేర్లు పట్టుదారాలకు గుచ్చి కొనాకు జలతారు కుచ్చులు గట్టి ఊళ్లెకు దెస్తడంట. నన్ను మొమ్మైమ్మె జేస్తె పుట్కెడు ముత్యాలు అయిత. పాపం! నా దోస్తులంత ప్యాదోళ్ళు వాళ్ళు యాడ ముత్యాలదండలు గొనుక్కుంటరు! గని అదొక్కతె బండాల మున్నది - పుల్లారెడ్డిబిడ్డ మొద్దుసత్తి ముక్కిడిముక్కుది సుప్పనాతి, శూర్పనక్క వాళ్ళయ్య ఏదంటే అది కొనియిస్తడు. ఇగ అదే నన్ను దండేసుకుంటది. ఛీ పోయి, పోయి నేను దానిమెల్ల ఊఁ అంటె ఆఁ రాని కువ్వారందాని మెల్ల వడ్తనా? అనుకున్నదేమొ అమ్మగారు నేను ముత్యాలైతె ఏసుకుంటనని; మొన్న పంతుల్గారు నా చేతికి బర్గెఇచ్చి నప్పటినుంచి నా మీద కచ్చె వట్టింది! అమ్మో! నేను సచ్చినా మొమ్మైమ్మెగాను.

ఇంతసేపు బుగులువట్టి, బయానికి కండ్లు మూముకున్న గద ఇప్పుడే దెరువ - నాకు సాళ్లే వద్దు గీళ్లె వద్దు - మొమ్మైమ్మె అంటె మంటలేవకుండ అయితనా? ఎందీ? చిర్మనంటు గోలినట్లు గోలాలె నంట ఆ టెన్క తుమ్మసాదును రాసినట్లు రాస్త రంట. మొద లేమొ మొమ్మైమ్మె జేసె టోళ్ళు పిల్లల్ను మప్పిచ్చి ఎంటవెట్టుకొని ఓ గుట్ట మీదికి జేర్తరంట. ఇంగ ఆడ గి సొంటి కుటిలవా జోళ్లే ఇంగ కొంతమంది జల్లై, పిల్లలకు ఇగో నెమిలిజాడు, అగో బుర్కపిట్ట జాడు, రామసిల్క జాడు, ఆడ బాయిగట్టుమీద చెట్టుతొర్రల పవిడికంటె జాడు, అని ఆయీ మాటలు జెప్పుకుంట ఉంటరంట. ఇంగ గుట్టకింద సెట్ల సాటున పెద్ద బాండ్లీ లల్ల నూనెవోసి మరి గిచ్చుకుంట ఉంటరంట. పాపం పిల్లలు ఈ పిట్టను, ఆ చెట్టును జూసుకుంట మరిసినట్లున్నప్పుడు బుడుక్కున ఆ నూనెల వడే టట్లు దొబ్బుత రంట ఆ మసిల్న నూనెల వడి పిల్లలు ఉగ్గు తీర్గ మైనం తీర్గ ముద్ద ముద్ద అయితరంట. అదే మొమ్మైమ్మె అయితదంట. అమ్మో, నేను మొమ్మైమ్మె గాను. గిమ్మైమ్మె గాను ఈ సారి మా యమ్మకు ఎట్టైనా జెప్త అని దబా దబా ఉరుక్కుంటొచ్చి, అమ్మా! అని కడ్పల కాలు వెట్టి కండ్లు దెరిసేవరకు నా కండ్లు బైర్లు గమ్మి, నేను కింద వడ్డంత పనైంది.

